

కులకచర్ల, మార్చి 26: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో కులకచర్ల మండల కాంగ్రెస్ పార్టీ బ్లాక్ 2 అధ్యక్షుడు కరె భరత్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు ఈ సందర్భంగా కులకచర్ల మండలానికి నిధులను మంజూరు చేయాలని కోరారు.

క్షయవ్యాధి నిర్మూలనకు సహకరించాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్

కులకచర్ల, మార్చి 26 : క్షయవ్యాధిని నిర్మూలిద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్ అన్నారు. మంగళవారం జాతీయ క్షయవ్యాధి నిర్మూలన దినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ వ్యాధి మైక్రోబ్యాక్టీరియం ట్యూబెర్కులోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుందన్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి సోకుతుందన్నారు. మూడు వారాల పాటు ఎడతెరపి లేకుండా దగ్గరావడం, తెమడ పడటం, అందులో రక్తం రావడం, జ్వరం రోజు విడిచి రావడం, ఆకలి కాకపోవడం, బరువు తగ్గడం, ఛాతినొప్పివంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. చాతీ ఎక్స్‌రే, స్కానింగ్, తెమడ పరీక్షా ద్వారా టీబీ రోగాన్ని నిర్ధారించవచ్చునని తెలిపారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే తగ్గిపోతుందని తెలిపారు. టీబీ వ్యాధి గ్రస్తులకు ప్రతి నెలా రూ. 500చొప్పున ఆరు నెలలు వారి ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ స్వరూప రాణి, సూపర్ వైజర్స్ యాదమ్మ, విజయలక్ష్మి, ఏఎస్ఎంలు రత్నమ్మ, వెంకటమ్మ, జ్యోతి, జంగమ్మ, శ్రీలత, సుజాత, మంగమ్మ, భారతమ్మ, స్టాఫ్‌నర్స్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

■ ఉచితంగా వైద్యపరికరాల పంపిణీ



బాధితుడికి వీల్‌చైర్స్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, కాంటినెంటల్ హాస్పిటల్ అధికారులు.

కొడంగల్, మార్చి 26: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో హైదరా బాద్‌లోని కాంటినెంటల్ హాస్పిటల్, ప్రాజెక్ట్ ఎంబ్రేస్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన వారికి వీల్ చైర్స్, బీపీ మిషన్స్, వాకింగ్ స్టిక్స్, గ్లూకోమీటర్స్, బెడ్స్‌తో పాటు మెడిసిన్ టేబుల్స్, తదితర సామగ్రిని అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంటినెంటల్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డా. గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు తెలంగాణలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా మోకిలా, సంగారెడ్డి జిల్లాలోని సంగూరు మండలం చెగ్గారెడ్డి పేటలో, పటాన్‌చెరువు మండలం జిన్నారం గ్రామంలో, ఆ తరువాత కొడంగల్ మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంటినెంటల్ హాస్పిటల్స్ డాక్టర్లు, సిబ్బంది, ప్రాజెక్ట్ ఎంబ్రేస్ టీం మెంబర్స్ రేవారెడ్డి, ఫౌండర్ అండ్ సీఈవో మోహన్ సద్దబట్ల, సీఈవో సామ్ ఫిలిప్స్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అభిజిత్ హరికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివకుమార్, కోఆప్షన్ సభ్యుడు మునీర్, లయన్స్ క్లబ్ సభ్యులు జయతీర్థాచారి, మురారివాశిష్ట, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

■ మాజీ ఎమ్మెల్యే పరామర్శ..

కులకచర్ల, మార్చి 26 : మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన వై రాములు అనారోగ్యంతో నిమ్స్ దవాఖానలో చికిత్స చేయించుకొని ఇంటికి చేరుకున్నాడు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటా మని రాములుకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు పీరం పల్లి రాజు, బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండుమల్ల నర్సింహులు, ఎంపీటీసీ మాలె పద్మారఘు, మాజీ ఎంపీటీసీ గుండు మల్ల ఆనంద్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లయ్య, వాడెల బాలచంద్రి, బాలయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

పంట రుణాలను సకాలంలో చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి

పెద్దేముల్, మార్చి 26 : రైతులు పంటరుణాలను సకాలంలో చెల్లిస్తేనే సొసైటీ అభివృద్ధి చెందుతుందని తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తట్టేపల్లి పీఏసీఎస్‌లో మహాజన సభ సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు, రైతుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలో రైతులకు సుమారు రూ.2 కోట్ల వరకు దీర్ఘకాలిక రుణాలను అందిస్తామని, రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని,ఎరువుల పంపిణీలో సంఘ సభ్యులకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రైతుల కోసం సొసైటీ పరిధిలో ఎరువులు,మందులను అందు బాటులో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంజయ్య, ఎంపీటీసీ శంకర్,డైరెక్టర్ రహీం, శంకర్, శ్రీరాం, సుక్కమ్మ, సొసైటీ సీఈవో రాజమౌళి, సిబ్బంది రాములు, జగదీశ్,మాజీ చైర్మన్ నారాయణ గౌడ్,రైతులు శ్రీనివాస్, శేఖర్, చంద్రశేఖర్, నర్సప్ప, రాంచందర్, వెంకటయ్య, పాల్గొన్నారు.

■ బెస్ట్ టీబీ హెల్త్ విజిటర్ అవార్డు

కులకచర్ల, మార్చి 26 :మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న కె రాజూనాయక్ బెస్ట్‌టీబీ హెల్త్ విజిటర్ అవార్డును అందుకున్నారు. జాతీయ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా వికారాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్కూన్‌కుమార్ చేతుల మీదుగా రాజునాయక్ బెస్ట్‌టీబీ హెల్త్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కులకచర్ల వైద్య సిబ్బంది రాజూనాయక్‌ను అభినందించారు.

రంజిత్‌రెడ్డి ఏనాడైనా గ్రామాల్లోకి వచ్చారా?

సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 26 : ప్రస్తుత ఎంపీ రంజిత్‌రెడ్డి చౌడాపూర్, కులకచర్ల మండలాల్లో ఏగ్రామానికైనా వచ్చారా అని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎంపీ కేవలం పదవి కోసమే ఉన్నారని, ఏనాడూ గ్రామాల్లో తిరిగి సమస్యలను తెలుసుకోలేదన్నారు. చౌడాపూర్, కులకచర్ల మండలాల్లోని గ్రామాల్లో తాను ఐదు సార్లు తిరిగానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపైన ప్రేమతో ప్రజలు ఓటు వేయలేదని ప్రభుత్వ మార్పుకావాలని ఓటు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్ రావు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతికిరణ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, బీజేపీ నాయకులు అంజిలయ్య, ఘనాపురం వెంకటయ్యగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్, చౌడాపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు బందయ్య, కులకచర్ల మండల అధ్యక్షుడు సురేశ్, కులకచర్ల మాజీ సర్పంచ్ జానకీరాం, సామ్యావెంకట్‌రాంరెడ్డి, గడుసు మహిపాల్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, నరసింహారెడ్డి, వెంకటేశ్, రాజశేఖర్, రామాంజనేయులు, కర్ణయ్య, రామకృష్ణ, మహేశ్, పోచయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు.

బొంరాస్‌పేట, మార్చి 26 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు, మన ఊరు-మనబడి పథకంలో పనులు చేసిన వారికి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ఎంపీడీవో శ్రీదేవికి వినితిపత్రం అందజేశారు. ఉపాధిహామీ పనులు చేసిన కూలీలకు ఆరు నెలల నుంచి కూలీ చెల్లించాలని నెలల తరబడి కూలీ ఇవ్వకుంటే కూలీలు ఎలా బతుకుతారని వారు ప్రశ్నించారు. మన ఊరు-మనబడి పథకంలో కిచెన్ షెడ్లు, మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్ అప్పులు చేసి నిర్మించారని, ఆరు నెలలైనా బిల్లులు రావడం లేదని వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి కూలీలకు బకాయి ఉన్న కూలీ, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, లేని యెడల ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరు చంద్రయ్య, సూర్యానాయక్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న గైనకాలజిస్ట్

వికారాబాద్, మార్చి 26 : టీఎస్ ఆర్టీసీలో విధులు నిర్వహించే ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని టీఎస్ఆర్టీసీ తార్నాక గైనకాలజిస్ట్ డాక్టర్ ఏకాంబరి తెలిపారు. మంగళవారం వికారాబాద్ ఆర్టీసీ డిపోలో డీఎం భక్షినాయక్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు, సిబ్బందికి ఓవరియాన్ సెంటర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఆరోగ్యస మస్యలు ఉన్నా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ ఆర్టీసీ లో విధులు నిర్వహించే మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ బోర్డు మెంబర్ పద్మ, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బంగారు, వెండి నగలు చోరీ

బండ్లగూడ, మార్చి 26: ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. కిస్మత్‌పూర్ శివసాయి నగర్ కాలనీలో నివాసి లోకేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హోలీ పండుగ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి సోదరుడి ఇంటికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చి చూడగా.. ఇంట్లో దొంగలు పడి 19.4తులాల బంగారం, కిలో వెండి ఆభరణలు ఎత్తుకెళ్లారు. వెంటనే లోకేశ్ పోలీసులకు సమాచారమిచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితుల నుంచి వివరాలను సేకరించారు. ఇంటి యజమాని లోకేశ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా కేసును దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం డీఐ నాగరాజు మాట్లాడుతూ.. తాళం వేసి ఉన్న ఇండ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఇంటికి సెంట్రల్ లాకింగ్‌ను సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు

మిషన్ భగీరథ నీటిని వృథా చేయొద్దు

వికారాబాద్, మార్చి 26: మిషన్ భగీరథ నీటిని వృథా చేయవద్దని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరైన సమయంలో వర్షాలు పడక భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో మనం ప్రతి నీటి బొట్టునూ జాగ్రత్తగా వాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టణంలోని కొందరు తాగునీటి కోసం ఇస్తున్న మిషన్ భగీరథ నీటితో ఇండ్లు, కార్లు కడుగుతూ వృథా చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే సొంత బోరు మోటర్ల ద్వారా వచ్చే నీటిని కూడా ఇష్టానుసారంగా వృథా చేస్తున్నారన్నారు. భవిష్యత్ తరాలకు నీరు అందించే బాధ్యత మనదే కాబట్టి ప్రతి ఒక్కరూ నీటి వృథాను అరికట్టాలని సూచించారు.

మాజీ సర్పంచ్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

వికారాబాద్, మార్చి 26 : వ్యక్తి గత కక్షలు మనస్సులో పెట్టుకొని వికారాబాద్ పులుసుమామిడి గ్రామ మాజీ సర్పంచ్ కమల్‌రెడ్డిపై దాడి చేసిన నాగిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపారు. ఐపీసీ సెక్షన్ 307 (హత్యా యత్నం) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళ వారం అరెస్టు చేసి న్యాయ మూర్తి ముందు హాజరు పరిచి పరిగి జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

కుంటలో పడి మహిళ మృతి

కులకచర్ల, మార్చి 26 : కుంటలో పడి మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నీటి కుంట దగ్గర క్రికెట్ ఆడుతున్న యువకులకు మహిళ మృతదేహం కనిపించిందని, వెంటనే పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మృత దేహాన్ని బయటకి తీశారు. కులకచర్ల గ్రామానికి చెందిన వెంకటమ్మ (55) గా గుర్తించారు. సోమవారం సా యంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన వెంకట మ్మ కుంట లో పడి మృతి చెందిందని తెలిపారు. భర్త కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కలప లారీ పట్టివేత..

కొడంగల్, మార్చి 26: అక్రమంగా కలపను తరలిస్తున్న లారీని అదుపులోకి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కర్ణాటక నుంచి కొడంగల్ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న ఈ లారీని గుర్తించి కేసు నమోదు చేసి ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పోలీసుల తనిఖీల్లో 30 కిలోల గంజాయి స్వాధీనం

బండ్లగూడ,మార్చి 26: ఎస్కార్ట్‌ను పెట్టుకుని గంజాయిని తరలిస్తున్న మురా సభ్యులను రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 30 కిలోల గంజాయి, ట్రాలీ, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి కథనం ప్రకారం.. చార్మినార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అయాన్ అలీ, మమ్మద్ మోహినుద్దీన్ భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తన బృందంతో కలిసి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారు జామున వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసులకు చిక్కకుండా ముందుగా ఒకరు ఎస్కార్ట్‌గా బైక్‌పై వస్తుండగా.. అతడిని అనుసరించి మరొకరు ట్రాలీలో గంజాయితో వస్తున్నారు. పోలీసులు బైక్‌పై వస్తున్న వ్యక్తిని పట్టుకుని విచారించడంతో.. వెనుకాల వస్తున్న గంజాయి ట్రాలీ గురించి తెలిపాడు. వెంటనే ఆటో ట్రాలీని నిలిపి తనిఖీ చేయగా.. 30 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ.10.50 లక్షల వరకు ఉంటుందన్నారు. నిందితుల నుంచి గంజాయి, ఆటో ట్రాలీ, బైక్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన గంజాయిని భద్రాచలంలో ఒడిశాకు చెందిన దీపక్ పాటిల్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. తదుపరి విచారణ నిందితులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు.

■ స్వీప్‌లో భాగంగా 5కే రన్

పరిగి, మార్చి 26 : స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరిగి పట్టణంలో 5కే రన్ కార్యక్రమాన్ని తహసీల్దార్ కె.ఆనంద్‌రావు ప్రారంభించారు. ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. అర్హులందరూ ఓటరు జాబితాలో నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీనివాసులు, బీఎల్‌వోల సూపర్‌వైజర్లు ఆర్ఐ నవీన్, చంద్రమోహన్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కాలిపోయిన బోరు... ట్యాంకర్‌తో నీటి సరఫరా

బొంరాస్‌పేట, మార్చి 26 : బొంరాస్‌పేట మండల కేంద్రంలో మంచినీటి ఎద్దడి నెలకొంది. వీరణ్ణ దేవాలయం సమీపంలో ఉన్న తాగునీటి బోరు మోటరు కాలిపోవడంతో మూడు రోజుల నుంచి కుమ్మరి వాడ, ఊరడమ్మ దేవాలయం పరిసర ప్రాంతాలు, మరికొన్ని ప్రాం తాలకు తాగునీటి సరఫరా జరగడం లేదు. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేశారు. అధికారులు స్పందించి కాలిపోయిన బోరు మోటారుకు మరమ్మతులు చేసి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

■ ఎండాకాలం..జరజాగ్రత్త

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 26: ఉపాధిహామీ కూలీలు వడదెబ్బతో జాగ్రత్తగా ఉండాలని కులకచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూలీలు ఎండబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం వేళలో ఉపాధిహామీ పనులు నిర్వహించాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు నిర్మించాలని తెలిపారు. తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

■ ఘనంగా ఆలయ ప్రారంభ వేడుకలు

పరిగి, మార్చి 26 : పరిగి మండల పరిధిలోని సయ్యద్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు హోమం, వినాయక పూజలు నిర్వహించారు. పూజారులు వివిధ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ వెంకట్‌రామకృష్ణారెడ్డి దంపతులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పి వెంకటయ్య దంపతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మాదిగలకు అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న భాగవాన్ ప్రసాద్

ఖైరతాబాద్, మార్చి 26 : కాంగ్రెస్ పాలనలో మాదిగలకు న్యాయం జరుగడం లేదని నేషనల్ ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యక్షుడు చింతా భగవాన్ ప్రసాద్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 లక్షల మంది దళిత జనాభా ఉంటే అందులో 62 లక్షల మంది మాదిగలే ఉన్నారన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు సైతం మాలలకు ప్రాధాన్యతనిస్తూ మాదిగలను విస్మరిస్తున్నదన్నారు. త్వరలోనే జరిగే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. రెండు ఎమ్మెల్సీ పదవులతో పాటు, కార్పొరేషన్లలో కనీసం నాలుగు మాదిగలకే కేటాయించాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులలో మాదిగలకు మూడింట రెండు వంతుల నిధులు ఇవ్వాలని, దళిత అభివృద్ధి పథకాల్లోనూ జనాభా దామాషా ప్రకారం వాటా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఓయూ జేఏసీ అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఆకుల శ్రీనివాస్, జయరాం పాల్గొన్నారు.

1న మండల సర్వసభ్య సమావేశం

వికారాబాద్, మార్చి 26 : ఏప్రిల్ 1న మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు చంద్రకళ అధ్యక్ష తన నిర్వహించనున్నట్లు వికారాబాద్ ఎంపీ డీవో వినయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ వారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి కో ఆప్షన్ సభ్యులు, స్పెషల్ ఆఫీసర్లు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

చేవెళ్లలో ఎగిరేది గులాబీ జెండానే..

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం..
- ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ పిలుపు

ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, మార్చి 26: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో ముచ్చటగా మూడోసారి ఎగురబోయేది గులా బీ జెండానేనని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ శ్రేణు లు సైనికుల్లా పనిచేసి అధిక మెజా ర్టీ వచ్చేలా పాటు పడాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం వివేకానందనగర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ఎన్నికల సన్నాహక సమావే శం మంగళవారం నిర్వహించారు. కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాస్ రావు , ఉప్పలపాటి శ్రీకాంత్ , మా జీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు, ఆ యా డివిజన్‌ల పార్టీ అధ్యక్షులతో కలిసి ఎమ్మె ల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్ర అవతరణ అనంతరం చేవెళ్లలో ఇప్పటికి రెండుసార్లు గులాబీ జెండానే ఎరిగిందని, ప్రజల మద్దతుతో మూడో విజయాన్ని సైతం నమోదు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెల్లోనే సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నదని, సాగు, తాగు సహా ఇతర రంగాలెన్నో చతికిల పడుతున్నాయని అన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలు, కాంగ్రెస్ ,బీజేపీల వైఫల్యాలను ఓటర్లకు వివరిస్తూ వారి మద్దతును కూడగట్టాలని , జ్ఞానేశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని, ప్రతి గడపకు వెళ్లి ఓటర్లను పలకరించాలని ఎమ్మెల్యే కోరారు. కేవలం మూడు నెలల వైఫల్య కాంగ్రెస్ పాలనతో విసిగిన ప్రజలు తొలి సీఎం కేసీఆర్ సుపరిపాలనను గుర్తు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ గౌడ్, గణేశ్ ముదిరాజ్, సంజీవ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గౌతం గౌడ్, కిరణ్‌యాదవ్, రాజునాయక్, లక్ష్మీనారాయణ, భాస్కర్, హరీష్‌రావు, పెద్ద భాస్కర్‌రావు , లక్ష్మారెడ్డి, గంగాధర్, భిక్షపతి, రాజేందర్, వేణు , జిల్లా గణేశ్, కాశీనా థ్, రామకృష్ణగౌడ్, శ్రీనివాస్, చంద్రిక పాల్గొన్నారు.

- ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో 12వ శ్రీ విష్ణు సహస్రనామ సామూహిక మహా పారాయణంలో సీవీఆర్ చానల్ చైర్మన్ చలసాని వెంకటేశ్వర్‌రావు, ఖమ్మం కమ్మ సంఘం అధ్యక్షుడు రామారావులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత వెల్లి విరిసేలా సమతామూర్తి కేంద్రం విరాజిల్లుతున్నదన్నారు.

సజావుగా సాగుతున్న 'పది' పరీక్షలు

వికారాబాద్, మార్చి 26 : 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరిగాయి. జ